క్లుప్తంగా

కేర్‌టేకర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అల్లూరు: నార్త్‌ఆములూరు పంచాయతీ పరిధిలోని గొల్లపాళెంలో ఉన్న అనాథ బాలల ఆశ్రమ పాఠశాలలో కేర్‌టేకర్లుగా పనిచేయుటకు అల్లూరు, కొడవలూరు మండలాలకు చెందిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆశ్రమ కరస్పాండెంట్ రామచంద్ర శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు–2, పురుషులు–1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఇంటర్మీడియట్ చదివిన వారు 94403 75370 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు



వరికుంటపాడు/ఆత్మకూరురూరల్/ సంగం: వరికుంటపాడు మండలం గణేశ్వరపురం, ఆత్మకూరు మండలం వెన్నవాడ ప్రాథమిక, సంగంలోని గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యారోగ్య సిబ్బంది శనివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని జవహర్ బాల ఆరోగ్య రక్ష కార్డుల్లో నమోదు చేశారు. డాక్టర్లు కరిష్మా, శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలకు వ్యవసాయ కళాశాల విద్యార్థులు



ఉదయగిరి: బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఉదయగిరి మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు శనివారం ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లారు. కళాశాల డీన్ కృష్ణారెడ్డి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. అధ్యాపకులు గోపికృష్ణ, రమణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



అనుమసముద్రంపేట: మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులను హెడ్స్ సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సత్కరించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ శ్రీలక్ష్మమ్మ, పీఈటీ రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ



సంగం: స్థానిక ఆంజనేయస్వామి మందిరంలో అయ్యప్ప మాలధారులకు ఆత్మకూరుకు చెందిన సాంబశివ చారిటబుల్ ట్రస్టు అధినేత నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి శనివారం అన్నప్రసాద వితరణ చేశారు. తొలుత అయ్యప్పస్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ట్రస్టు సభ్యులు కుడుముల సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ



అల్లూరు: కావలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి అలహరి సుధాకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని అల్లూరు ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు బ్రెడ్లు, పండ్లను శనివారం పంపిణీ చేశారు. జనసేన నాయకులు కార్తీక్‌శర్మ, రాఘవయ్య, మల్లికార్జున, నాగేశ్వరరావు, విజయ్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన



ఆత్మకూరు : జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన బట్టేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అర్చనను ఆర్డీఓ బీ పావని అభినందించారు. అర్చన తిరుపతిలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విషయం తెలుసుకున్న ఆర్డీఓ తన కార్యాలయానికి పిలిపించుకుని అభినందించి ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. బట్టేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంపద కరిగింది..చెత్త మిగిలింది

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు

కొండాపురం: కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్‌లో భాగంగా పల్లెలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సంకల్పించింది. చెత్తను సంపదగా మార్చడం ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలని తలచింది. ఉపాధి హామీ పథకం కింద లక్షలాది రూపాయలతో పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించాలని నిర్ణయించింది. మండలంలో 19 పంచాయతీలు ఉండగా, 18 పంచాయతీల్లో వీటిని నిర్మించింది. చెత్త సేకరణకు గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు, రిక్షాలను సైతం అందజేసింది. వీరు కొద్దిరోజుల పాటు ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించారు. తడి చెత్త నుంచి వర్మికంపోస్టును తయారు చేశారు. వీటిని విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సైతం సమకూరింది. అనంతరం అధికారులు వర్మికంపోస్టు తయారీ, గ్రీన్‌అంబాసిడర్లకు వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడంతో సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం మండలంలో మూడు కేంద్రాలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగిలిన పదిహేను కేంద్రాలు నిరుపయోగంగా మారి అసాంఘీక కార్యకలాపాలు, మందుబాబులకు అడ్డాలుగా మారాయి.



గానుగపెంటలోని సంపద తయారీ కేంద్రంలో పెరిగిన కంపచెట్లు



గతేడాది తుపాన్‌కు పైకప్పు లేచిపోయిన పార్లపల్లిలో సంపద కేంద్రం

గ్రీన్‌అంబాసిడర్లకు అందని వేతనాలు

గ్రామాల్లోని చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించేందుకు ప్రభుత్వం గ్రీన్‌అంబాసిడర్లను ఏర్పాటు చేసింది. వీరికి సర్పంచ్‌లు వేతనాలు చెల్లించాల్సి ఉంది. అయితే పంచాయతీల్లో నిధులు లేకపోవడం.. వేతనాల బిల్లులకు పంచాయతీ అధికారులు సహకరించకపోవడం, తదితర కారణాలతో వేతనాలను సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో గ్రీన్‌అంబాసిడర్లు అధిక శాతం పంచాయతీ చెత్త సేకరణ పనులను నిలిపివేశారు. కొన్ని పంచాయతీల్లో మాత్రమే పనులు చేపడుతున్నారు. దీంతో పంచాయతీల్లో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి దర్శనమిస్తోంది.

వినియోగంలోకి తీసుకొస్తాం

మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. గ్రామాల్లో చెత్తను పారిశుధ్య కార్మికుల ద్వారా సేకరించి సంపద కేంద్రాలకు తరలించే పనులు సాగుతున్నాయి. అన్ని కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తాం.

– నారాయణ, ఈఓపీఆర్డీ

మున్సిపల్ బస్టాండ్‌లో జేబు దొంగల చేతివాటం

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్‌లో జేబు దొంగలు చేతివాటం చూపుతున్నారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ నుంచి 80కుపైగా బస్సులు ప్రయాణిస్తుంటాయి. వాటి ద్వారా వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అమాయకులను లక్ష్యంగా చేసుకుని జేబు దొంగలు చేతివాటం చూపుతున్నారు. శనివారం అనంతసాగరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన శేషమ్మ తన గ్రామానికి వెళ్లేందుకు బస్సులో కూర్చుని ఉండగా ఓ యువకుడు ఫోన్‌పే ద్వారా కండక్టర్‌కు డబ్బులు పంపి నీకిస్తాను రూ.500 ఇవ్వాలని కోరాడు. దీంతో ఆమె తన వద్దనున్న రూ.900 నగదులో రూ.500 ఇచ్చింది. ఇంకా ఆమె వద్ద రూ.400 ఉండగా అవి కూడా ఇవ్వాలని లాక్కుని పరారయ్యాడు. దీంతో శేషమ్మతో పాటు ఆమె బంధువులు దొంగ వెంట పరిగెత్తినా వాడు ప్రభుత్వ ఆస్పత్రి, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మీదుగా హిల్‌రోడ్డులోకి పారిపోయాడు. ఇలాగే గత రెండు రోజుల క్రితం వింజమూరు మండలానికి చెందిన ఓ మహిళ వద్దకు ఓ యువకుడు వచ్చి చిల్లర కావాలని అడిగాడు. ఆమె చిల్లర తీసి ఇస్తుండగా నగదు లాక్కుని పరారయ్యాడు. దీంతో ఆమె ఎవరికి చెప్పుకోవాలో తెలియక స్వగ్రామానికి వెళ్లిపోయింది. మరోవైపు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్టాండ్ వద్ద విద్యార్థినులపై కొందరు యువకులు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నారు. దీంతో విద్యార్థినులు సమీపంలోని కొన్ని దుకాణాల్లో తమ బస్సులు వచ్చేంత వరకు వేచి ఉండి అవి వచ్చాక ఎక్కి వెళ్తున్నారు. మున్సిపల్ బస్టాండ్‌లో పోలీసు ఔట్‌పోస్టు లేదు. పోలీసులు అప్పుడప్పుడు వచ్చి రౌండ్లు వేసిపోతున్నారు. దీంతో జేబు దొంగలు, ఈవ్‌టీజర్లు చెలరేగిపోతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. పోలీసులు అధికారులు స్పందించి పోలీసు ఔట్‌పోస్టును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎస్సై షేక్ జిలానీని సంప్రదించగా బస్టాండ్ ప్రాంతంతో పాటు ముఖ్యమైన కూడళ్లలో పోలీసు నిఘా పెంచుతామని, నేరాలను అరికడతామన్నారు. ప్రయాణికులు సైతం అప్రమత్తంగా ఉండాలని, నగదును జాగ్రత్తగా దాచుకోవాలని సూచించారు.

హైవేలపై బ్లాక్‌స్పాట్‌ల పరిశీలన



మర్రిపాడు/సంగం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నెల్లూరు–ముంబై, ఏర్పేడు–నకిరేకల్ జాతీయ రహదారులను ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు పోలీసులు, హైవే అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. సంగం, మర్రిపాడు మండలాల పరిధిలో హైవేలపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



ఉదయగిరి: మండలంలోని గన్నేపల్లె పంచాయతీ పరిధిలోని మిట్టపల్లెలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శనివారం ఉదయం నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రికి సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ

అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఈఓపీఆర్డీ రమేష్, టీఓటీలు దామోదర్, సయ్యద్ బాబా, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు యూటీఎఫ్ మండల సమావేశం

సీతారామపురం : యూటీఎఫ్ మండల సమావేశాన్ని సీతారామపురం జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భోగ్యం శ్రీనివాసులు, గొడ్లవేటి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఉదయం 9.30 గంటలకు జరిగే యూటీఎఫ్ మండల సమావేశానికి జిల్లా నాయకులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ మిత్రులందరూ తప్పక హాజరుకావాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతయ్య, గౌరవాధ్యక్షుడు గాజుల రంతుజాని, మండల నాయకులు పీసీఎం కొండయ్య, పేరాల శ్రీనివాసులు, ఆనందీశ్వరయ్య, మహేష్, సురేష్, నరసింహారాజు, లక్ష్మయ్య, బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను తవ్వేశారు.. వేయడం మరిచారు



కంకరపరిచి వదిలేసిన ఆదిమూర్తిపురం-యర్రబల్లి రోడ్డు



వింజమూరు-చాకలకొండ రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

ఉదయగిరి: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లపై గుంతలను వందరోజుల్లో మాయం చేస్తామని ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి 150 రోజులు గడిచినా గుంతల పూడ్చివేత సంగతి దేవుడికెరుక మరమ్మతుల పేరుతో రోడ్లను తవ్వి వదిలేశారు. వింజమూరు–చాకలకొండ, ఆదిమూర్తిపురం–యర్రబల్లి మార్గాల్లో పలుచోట్ల రోడ్లను తవ్వి మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు నరకాన్ని చవిచూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మూణ్ణాళ్ల ముచ్చట

ఆత్మకూరు: పట్టణంలోని ప్రధాన రోడ్డు ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి సోమశిల రోడ్డు మలుపు వరకు గుంతలతో అధ్వానంగా తయారైంది. రెండు వారాల క్రితం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటన నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులు తూతూ మంత్రంగా గుంతలను కంకర, బూడిదతో పూడ్చారు. అయితే పట్టణంలో మూడు రోజులుగా కురుస్తున్న ఓ మోస్తరు వర్షాలకు కంకర, బూడిద కొట్టుకుపోవడంతో తిరిగి యథాస్థితిగా గుంతలు దర్శనమిస్తున్నాయి. వర్షాలకు నీరు నిలిచి గుంతలు కనిపించకపోతుండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. ఇలా తూతూ మంత్రంగా మూణ్రోజులకే బయటపడేలా గుంతలు పూడ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వర్షాలకు కంకర,బూడిద లేచిపోవడంతో ఏర్పడిన భారీ గుంతలు

బోడవారిపల్లెలో అధ్వానంగా పారిశుధ్యం

దుత్తలూరు: మండలంలోని బోడవారిపల్లిలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఇళ్లలోని మురుగు వీధుల్లో ప్రవహిస్తూ మడుగులు కడుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా వీధుల్లో నడిచే పరిస్థితి లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో మురుగు నిల్వ ఉండటంతో దోమలు విజృంభించి విషజ్వరాల బారినపడుతున్నామని వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శికి సమస్యను విన్నవించినా తాను ఇన్‌చార్జిని మాత్రమేనని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరిచి రోగాల బారిన పడకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గ్రంథాలయ ఉద్యమ నాయకులకు నివాళి



చేజర్లలో చిత్రలేఖన పోటీలు



ఆత్మకూరు: గ్రంథాలయ ఉద్యమ నాయకులకు నివాళులు

ఆత్మకూరు/వింజమూరు(ఉదయగిరి)/సంగం/సోమశిల: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమ నాయకుల చిత్రపటాలకు శనివారం నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, ఎస్‌ఆర్ రంగనాథన్, తదితరుల సేవలను స్మరించుకున్నారు. విశ్రాంత లైబ్రేరియన్ గోవిందరెడ్డి, పూనూరు రమేష్‌రెడ్డి, ఎం చంద్రమౌళి రెడ్డి, లైబ్రేరి రికార్డ్ అసిస్టెంట్ ఎల్ తనూజ, తదితరులు పాల్గొన్నారు. వింజమూరులోని గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు లైబ్రేరియన్ జ్యోతి కొండయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయాల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. సంగం గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. తెలుగు పండితులను సన్మానించారు. తెలుగు ఉపాధ్యాయుడు సబ్బు ప్రవీణ్, లైబ్రేరియన్ రవీంద్రనాథ్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. చేజర్లలోని మానస పాఠశాలలో 6, 7 తరగతుల విద్యార్థులకు లైబ్రేరియన్ పీ కల్పన ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతసాగరంలోని గ్రంథాలయంలో 6, 7 తరగతుల విద్యార్థులకు పొడుపు కథలపై పోటీలు నిర్వహించారు. ఎంఈఓ–2 కె ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథి హాజరై గ్రంథాలయ ఉద్యమ నాయకులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్‌ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుపండిట్ మహ్మద్‌బాషా, వికాస్ హైస్కూల్ ఉపాధ్యాయుడు వెంకటరమణ, జెడ్పీ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయిని సులోచన, బీసీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి

దుత్తలూరు: మండలంలో ఇంటింటి సర్వే, ఎన్పీసీఐ ఆధార్ లింక్ కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ మల్లికార్జున అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం ఇంటింటి సర్వేలో జిల్లాలోనే వెనుకబడి ఉందని తెలిపారు. స్పందించిన సిబ్బంది మాట్లాడుతూ పంచాయతీల నుంచి బదిలీ అయిన వారి స్థానంలో కొత్తవారు రాకపోవడంతో తమపై అధిక భారం పడుతోందని విన్నవించారు. సిబ్బంది పూర్తిస్థాయిలో లేకుండా సర్వే ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

విద్యార్థుల వంట వార్పు



వింజమూరు(ఉదయగిరి): స్థానిక ఇన్‌ఫాంట్ జీసెస్ పాఠశాలలో శనివారం వంటవార్పు కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులతో వివిధ రకాల వంటలను తయారు చేయించారు. కరస్పాంటెంట్ ఐజాక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై సీపీఎం నిరసన

ఆత్మకూరురూరల్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై పట్టణ సీపీఎం నాయకులు శనివారం నిరసన తెలిపారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డులో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న ప్రైవేట్ వ్యక్తులను వారు అడ్డుకుని అనుమతి పత్రాలను చూపాలని కోరారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా విద్యుత్ మీటర్లను మార్చడాన్ని తప్పుబట్టారు. స్మార్ట్ మీటర్ల పేరుతో గృహాలు, వ్యాపార సముదాయాలకు కొత్త మీటర్లు బిగించి అదనపు వసూళ్లు చేపడితే ప్రజల పక్షాన తాము పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు లక్కు ప్రసాద్, యస్దాని, తదితరులు పేర్కొన్నారు.



స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న సిబ్బందిని అడ్డుకుంటున్న సీపీఎం నాయకులు

సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఆత్మకూరురూరల్: ఆర్టీసీ సిబ్బంది సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆత్మకూరు డిపో మేనేజర్ కరీమున్నీసా అన్నారు. సమయపాలన మాసోత్సవాల సందర్భంగా ఆత్మకూరు ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఉద్యోగులతో గేట్ మీటింగ్‌ను శనివారం నిర్వహించారు. ఆర్టీసీ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజల నుంచి ఫిర్యాదులు అందకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. ఇంధన పొదుపునకు కృషి చేయాలన్నారు. బస్సులు ఎలాంటి ప్రమాదాలు గురికాకుండా గ్యారేజీ కార్మికులు వాటిని కండీషన్‌లో ఉంచాలని, డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని కోరారు.



టిడ్కో ఇళ్ల సమస్యలను పరిష్కరించాలి

- కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి

కావలి: మద్దూరుపాడులోని ఏపీ టిడ్కో గృహ సముదాయంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి శనివారం అసెంబ్లీలో ప్రస్తావించారు. 2012లో టిడ్కో గృహ సముదాయంలో 2012 ఇళ్లను నిర్మిస్తే, ఇప్పటి వరకు 1309 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. అందులో కూడా 324 మంది మాత్రమే నివాసాలు ఉంటున్నారని చెప్పారు. టిడ్కో గృహ సముదాయంలో సమస్యల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. టిడ్కో ఇళ్లకు తూర్పు వైపున చెరువు ఉందని, దాని లెవల్‌లోనే టిడ్కో ఇళ్ల బేస్‌మెంట్‌లను నిర్మించారని తెలిపారు. చెరువులో నీరు నిండుగా ఉంటే ఇళ్లలోకి నీరు వచ్చే దుస్థితి నెలకొందన్నారు. పడమర వైపున ఉన్న 300 ఎకరాల్లోని నీరు కూడా టిడ్కో గృహాల్లోకి వస్తుండడంతో గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉండేవాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ కారణాలతో ఇళ్లలోకి చేరేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదని విన్నవించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి టిడ్కో గృహసముదాయం చుట్టూ ప్రహరీని నిర్మించడంతో పాటు డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా కావలి నియోజకవర్గంలో ఇరిగేషన్‌కు సంబంధించిన మైనర్ వర్క్స్‌కు నిధులు మంజూరు చేసి పంట కాలువలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. తీరప్రాంత గ్రామాల్లోని విద్యుత్‌లైన్లను సుమారు 20 ఏళ్లుగా మార్చలేదని, వాటిని మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించాలి



కొండాపురంలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న అధికారులు



ఏఎస్‌పేటలో అవగాహన కల్పిస్తున్న డీఈ మురళీకృష్ణ

జలదంకి: సాగునీటి సంఘాల ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఇరిగేషన్ డీఈఈ మహేష్ అన్నారు. స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై పీఓ, ఏపీఓలకు శనివారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని 23 చెరువులు, 8 మేజర్ కాలువల పరిధిలోని సాగునీటి సంఘాలకు ఈ నెల 23న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టీసీలోని సభ్యులే ఎన్నికల్లో పోటీ చేయాలని, వారిని బలపరిచే వారు కూడా అదే టీసీలో ఓటు కలిగి ఉండాలన్నారు. పోటీ చేసే వ్యక్తి నామినేషన్ దాఖలు సమయంలో హాజరై సంతకాలు చేయాలన్నారు. ఎన్నికల్లో సమానంగా ఓట్లు వస్తే లాటరీ ద్వారా విజేతను ప్రకటిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణపై సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తహసీల్దార్ ప్రమీల, ఇరిగేషన్ ఏఈలు మాల్యాద్రి, గోపీకృష్ణ పాల్గొన్నారు.

సంగం: మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ సోమ్లానాయక్ సాగునీటి సంఘాల ఎన్నికలపై పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. మండలంలోని నాలుగు మైనర్, రెండు మేజర్ సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని, అందుకు సంబంధించి ఓటర్ల జాబితాను విడుదల చేశామని తెలిపారు. అనంతసాగరం, సంగం మండలాల ఇరిగేషన్ జేఈలు లీలాకుమారి, వినయ్ పాల్గొన్నారు.

కొండాపురం: మండల పరిషత్ కార్యాలయంలో కలువాయి మండల ఇరిగేషన్ డీఈ ఆర్‌కే రెడ్డి ఆధ్వర్యంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఇరిగేషన్ ఏఈ రమేష్, తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీఓ ఆదినారాయణ పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్ డీఈ రమణారావు ఆధ్వర్యంలో సాగునీటి సంఘాల ఎన్నిల నిర్వహణపై పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ హమీద్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక స్త్రీశక్తి భవనంలో సోమశిల ప్రాజెక్ట్ డీఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ నెల 23న మండలంలోని 11 చెరువులతో పాటు గండిపాళెం జలాశయం పరిధిలోని 9 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ హేమంత్ కుమార్, ఇరిగేషన్ ఏఈ అంకులయ్య తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్ డీఈ గురుమూర్తి ఆధ్వర్యంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. మండలంలోని 12 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నోడల్ అధికారి, ఇరిగేషన్ ఏఈ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మకూరు ఇరిగేషన్‌శాఖ డీఈ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మండలంలోని 14 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాటి పరిధిలోని 2,007 మంది పురుష, 774 మంది మహిళా ఓటర్లు ఉన్నారని, వారందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఇరిగేషన్ ఏఈ యాసిన్, డీటీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.